
# 'కల' కలం



అదో సాదాసీదా రైల్వే స్టేషన్. ప్యాసింజరు రైళ్లు తప్ప ఎక్స్‌ప్రెస్‌లు ఆగని ఆ పల్లెటూరు స్టేషన్‌లో ఓ రోజు ఉదయం పదిగంటల వేళ... ''యావయ్యా, కామేశ్వర్రావూ ఇది విన్నావా?'' డ్యూటీలో వున్న స్టేషన్ మాస్టర్ నాగభూషణం డ్యూటీలో కాకుండా వీక్లీ ఆఫ్‌లో వున్న ఎఎస్ఎమ్ కామేశ్వర్రావుని అడిగాడు. ''ఏది? మాస్టారూ? మీరింకా చెప్పందే?'' అన్నాడు కామేశ్వరరావు. వాళ్లద్దరికీ డైలాగ్ అలా ఓపెన్ కావడం మామూలే. నాగభూషణానికి జనరల్ నాలెడ్జ్ పుస్తకాలంటే చాలా ఇష్టం. వాటిని కొంటాడు. తెగ చదువుతాడు. బండి అక్కడితో ఆగిపోదు. తన పరిజ్ఞానం ప్రపంచానికి తెలియాలి. పంచుకునేందుకు శ్రోత కావాలి. ఆ స్టేషన్‌కి దగ్గర్లో మరో ఎంటర్‌టైన్‌మెంట్ లేదు. పెళ్లికాకుండా క్వార్టర్స్‌లో ఒంటరిగా వండుకు తింటున్న కామేశ్వరరావుకి టైమ్‌పాస్ కాదు. అందువల్ల డ్యూటీలో వున్నా, రెస్టేడే నాడైనా ప్లాట్‌ఫారమ్మీదే తచ్చాడుతూ వుంటాడు.

''విషయం ఏమిటంటే... విక్టోరియా మహారాణి తొలిసారిగా 'ట్రయలర్ రన్' కోసం పొగబండి ఎక్కినప్పుడు ఆ వేగాన్ని చూసి కంగారు పడిందట! డ్రైవరూ కొంచెం నెమ్మదిగా పోనీవయ్యా అందట! అప్పుడా బండి వేగం ఎంతో తెలుసా? గంటకి పదిహేను కిలోమీటర్లు'' అంటూ నాగభూషణం ప్లాట్‌ఫామ్మీద నిద్రపోతున్న కుక్కపిల్ల జడుసుకునేంత గట్టిగా నవ్వాడు.


మర్యాద కోసం మన కామేశ్వరరావు నవ్వాడు కానీ ఇలాంటి సబ్జెక్టు మీద ఆ యువకుడికి ఆసక్తి లేదు. అతని దృష్టిలో ఇది పనికిరాని పరిజ్ఞానం. ''ఎందుకు మాస్టారూ? ఇలాంటి వాటితో టైమ్ వేస్ట్ చేసుకుంటారు? వీటికి బదులు డిపార్ట్‌మెంట్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అయితే చక్కగా ఆఫీసరైపోయి వుండేవారు కదా?'' అని మొహమ్మీదే అనేశాడు కామేశ్వరరావు.

నాగభూషణం పట్టించుకోలేదు.

''అలాగనేనోయ్. మరో రెండు చెప్పనీ'' అని పొడుం పీల్చారు. పీల్చి-

''మనం కలలుగంటున్నప్పుడల్లా రెప్పల కింద గుడ్లు గోళీకాయల్లా అటూ ఇటూ చలిస్తాయట. అలాగే కలల్లో మనకి కనిపించే సుదీర్ఘమైన దృశ్యాలూ, సంఘటనలూ గట్రా కొన్ని సెకెన్లలోనే ముగిసిపోతాయట! ఈ మధ్య ఓ పుస్తకంలో చదివాను'' అన్నాడు స్టేషన్ మాస్టర్

# పొగబండి కథలు



– ఉలేటి శ్రీనివాసభాను



నాగభూషణం.

అంతలో పొరుగు స్టేషన్ నుంచి 'లైన్ క్లియర్' కోసం బ్లాక్ ఇనుస్ట్రుమెంట్ నుంచి 'బీట్స్' వినిపించాయి.

''అదిగో టూ నాట్ ఫోర్ ఎక్స్‌ప్రెస్‌కి లైన్ క్లియర్ అడుగుతున్నాడు'' అంటూ నాగభూషణం స్టేషన్ బిల్డింగ్‌లోకి వెళ్లాడు. లైన్ క్లియర్ ఇచ్చాడు. మళ్లీ ప్లాట్‌ఫారమ్మీదకొచ్చాడు.

''ఏమిటి మాస్టారూ...నిజమేః; నాకూ ఒక్కోసారి తెల్లాట్లా కలలొస్తాయి. ఒకే కల పత్రికలో సీరియల్లాగా కంటిన్యూ అవుతుంది'' అన్నాడు కామేశ్వరరావు.

''చూశావయ్యా కామేశ్వరరావ్-నాది పనికిరాని పరిజ్ఞానం అంటావ్. ఇప్పుడు నీక్కూడా ఇంట్రెస్టు పుట్టింది'' అంటూ ముక్కు మీద జారిపోతున్న కళ్ల జోడుని ఎగదోసుకున్నాడు నాగభూషణం.

''అబ్బే లేదండీ జస్ట్ ఐడిల్ క్యూరియాసిటీ! ఇప్పటికీ నా మాటకి కట్టుబడే వున్నాను. ఐ డోంట్ గివ్ మచ్ ఇంపార్టెన్స్'' అన్నాడు కామేశ్వరరావు లైట్‌గా తీసుకుంటూ.

అంతలో టూనాట్ ఫోర్ ఎక్స్‌ప్రెస్ పక్క స్టేషన్ 'పాస్' అయింది. 'అవుట్' రిపోర్టు వచ్చింది. నాగభూషణం కంట్రోల్ ఫోన్‌లో మాట్లాడి, తమ స్టేషన్‌లో ఆగని ఆ ఎక్స్‌ప్రెస్‌ని 'పాస్ త్రూ' చెయ్యడానికి 'లైన్‌క్లియర్' తీసుకొని 4 క్యాబిన్‌మెన్‌కి చెప్పి సిగ్నల్స్ వేయించాడు. కాసేపట్లో టూ నాట్ ఫోర్ ఎక్స్‌ప్రెస్ సైట్ అయింది. హైస్పీడ్‌లో వెళ్తూ ప్లాట్‌ఫారమ్ మీద సగం బండి పాస్‌కాగానే హటాత్తుగా వేగం తగ్గింది. చక్రాల వంపుల మీద 'బ్రేక్ బ్లాక్స్' ఒరుసుకోడంతో 'కీచు' మంటూ చప్పుడై కొన్ని సెకన్ల పాటు బండి ఆగి మళ్లీ స్టార్టయింది. ఆ కొద్ది వ్యవధిలోనే పెద్ద కుదుపు. ఎక్స్‌ప్రెస్ ఎందుకు ఆగుతోందో తెలుసుకోవాలని గార్డుతో పాటు కొందరు ప్రయాణీకులు కిటికీలోంచి తొంగి చూశారు.

ప్లాట్ ఫారమ్మీద వున్న కామేశ్వరరావు ఆత్రుతగా ఇంజన్‌వైపు చూశాడు. రైలు పట్టాల్ని ఓ ఆవు అడ్డంగా దాటుతూ డ్రైవర్ బ్రేక్ వేయ్యడం వల్ల రెప్పపాటులో తప్పించుకుంది. డ్రైవర్‌తో పాటు కామేశ్వరరావు కూడా ఊపిరి తీసుకున్నాడు. అలా తీసుకుంటూ తన ఎదురుగా ఆగి వెళుతున్న ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ కిటికీలో రెల్లు పొదల చాటున చంద్రబింబం లాంటి ఆ ముఖాన్ని చూశాడు! 'నళిని'... కామేశ్వరరావుకి ఊపిరాగినంత పనయింది.

మూడక్షరాల 'నళిని' పేరును తలచుకొన్నప్పుడల్లా ముప్పై జన్మల అనుబంధం కామేశ్వరరావుకి గుర్తొస్తుంది. నళిని తనకన్నా రెండేళ్ల జూనియర్. ఇరుగు పొరుగు ఇళ్లు కాకపోయినా- ఇద్దరిదీ ఒకే ఊరు. స్కూలు, కాలేజీ కూడా ఒకటే. నళిని అందంగా వుంటుంది. అందంగా పాడుతుంది. కాలేజీ డ్రామా అసోసియేషన్‌కి కామేశ్వరరావు సెక్రటరీగా ఉన్నప్పుడు నళిని చేత పాడించేవాడు. ఓసారి బతిమాలి తనతో పాటు డ్రామాలో నళిని చేత వేషం కూడా వేయించాడు. మొదట నళిని జంకింది. ఇంట్లో వాళ్లు ఏమంటారోనని భయపడింది. కానీ అందులో ఆ అమ్మాయిది కామేశ్వరరావుకి కూతురి పాత్ర. అందువల్ల నళిని ఒప్పుకొంది. కానీ ఎప్పటికైనా నళిని పక్క హీరోగా వేయాలని, తన నిజజీవితంలో ఆ అమ్మాయిని హీరోయిన్ చేసుకోవాలని కామేశ్వరరావు కలలు కనేవాడు. మనసులో ఆరాధించేవాడు. మాటల్లో వ్యక్తం చేయాలని తెగ ప్రయత్నించాడు. చివరికి తెగించాడు. తన ప్రేమని తెలివెన్నెల్లాంటి కాగితమ్మీద రాసి, నళినికి అందించాడు.

'టచ్ మీ నాట్' లా వుండే నళిని తెల్లవారగట్ట చెరువులో కలువలా మనసు రేకులు విప్పింది. మొదట మౌనంతో అర్ధంగీకారాన్ని, తరువాత ఉత్తరం ద్వారా పూర్తి అంగీకారాన్ని తెలియజేసింది.

అలా కామేశ్వరరావు ఫైనలియర్ క్షణంలో గడిచిపోయింది. నళిని డిగ్రీ పూర్తిచేయకుండానే మేనబావని పెళ్లి చేసుకుని ఫారిన్ వెళ్లిపోయింది. కామేశ్వరరావు స్పోర్టివ్‌గా తీసుకున్నాడు. అతను నటించిన డ్రామాల్లోని ఇతివృత్తాలు చాలా వరకూ అలాంటివే! వాటికే ప్రైజులు, పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. నాటకంలో సీన్ పూర్తికాగానే లైట్లు ఆరిపోతాయి. తెరపడుతుంది. అలాగే నళినితో ప్రేమ కూడా! ఇది జరిగి ఆరేళ్లయింది. కామేశ్వరరావు అయిదేళ్ల క్రితం రైల్వేలో ఏఎస్ఎమ్‌గా చేరాడు. పెళ్లిచేసుకోమంటూ పెద్దలు ఒత్తిడి చేస్తున్నారు. ఇదిగో, అదిగో అంటూ కామేశ్వరరావు వాయిదాలు వేస్తున్నాడు.

ఫారిన్ నుంచి నళిని, భర్త వచ్చుంటారు. ఎక్స్‌ప్రెస్‌లోని ఫస్ట్‌క్లాస్ కిటికీలో కామేశ్వరరావు కంటపడింది. ఖచ్చితంగా నళినీయే. ఆ కొద్ది సెకన్లలోనే నళిని కూడా అతడ్ని గుర్తించినట్లుంది. గాలికి ఊగిన మల్లెతీగలా మెడ వంచింది. క్షణంలో వెయ్యోవంతులో ముగిసిన అణువిస్ఫోటంలా నవ్వింది. ఆగినట్లే ఆగిన ఎక్స్‌ప్రెస్ కొద్ది సెకన్లలోనే వేగం పుంజుకుంది. నళిని మోహం శూన్యంలోని స్కెచ్‌లాగా కామేశ్వరరావు కనుపాపల్లో మిగిలిపోయింది.

ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోగానే కామేశ్వరరావు స్టేషన్లోకి వచ్చాడు.

''మాస్టారూ! మీరు చెప్పింది నిజమే సార్. కల్లో సుదీర్ఘమైన అనుభూతుల వ్యవధి నిజానికి కొన్ని సెకన్లే. ఒప్పుకుంటాను'' అన్నాడు.

''ఇందాక కొట్టిపారేశావ్. ఇప్పుడెలా ఒప్పుకొన్నావ్?'' ఎస్ఏఓ నాగభూషణంలో గెలుపు సంబరం.

''టూ నాట్ ఫోర్ ఎక్స్‌ప్రెస్ ఇలా ఆగి అలా వెళ్లినప్పుడు నాకు అర్థమైంది'' అన్నాడు కామేశ్వరరావు.

అదెలా అర్థమైందో నాగభూషణానికి అర్థం కాలేదు.

★

## కొత్త కెరీర్‌ను వెతుకుతున్న పాత జేమ్స్ బాండ్



జేమ్స్ బాండ్-007 పాత్రని తొలిసారి ధరించిన నటుడు సీన్ కానరీ ఇప్పుడు కొత్త కెరీర్‌ని మొదలు పెట్టాలని ఆశిస్తున్నాడు. అయిత ఆ కెరీర్ ఏమిటన్నది మాత్రం ఇంకా ఓ నిర్ధారణకు రాలేదట. ''నేనిక సినిమాలు చేయకూడదని నిశ్చయించుకున్న తరువాత నా జీవితమంతా ఖాళీ అయిపోయినట్టనిపించింది. ఇప్పుడు నా మెదడులో ఏదో రూపుదిద్దుకుంటోంది. ఇంకేదో చేయాలనిపిస్తోంది. కొత్త కెరీర్ ప్రారంభించాలనిపిస్తోంది. కాని అదేమిటన్నది ఇంకా ఓ రూపం సంతరించుకోలేదు'' అంటున్నాడు. 2003లో నటించిన 'లీగ్ ఆఫ్ ఎక్స్‌ట్రార్డినరీ జెంటిల్‌మన్' ఆయన చివరి చిత్రం. జేమ్స్ బాండ్ పాత్రని ఏడుసార్లు పోషించిన సీన్ కానరీ ఇప్పటి వరకూ ఆ పాత్రను ధరించిన వారిలో మేటి నటునిగా ప్రశంసలందుకున్నాడు. జేమ్స్ బాండ్ పాత్రలే కాక ఇతర పాత్రల్లో కూడా ఆయన నటన ప్రశంసలందుకుంది. 'అన్ టచబుల్స్'లో పోషించిన నిజాయితీ గల పోలీసు ఉద్యోగి పాత్రకుగాను ఆయన 1987లో ఆస్కార్ అవార్డు కూడా అందుకున్నారు.